
'రాజముద్ర'తోనే పట్టాదారు పాసుపుస్తకం





- జారీకి ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే జిల్లాకు చేరిన 79,062 భూ యాజమాన్య హక్కు పత్రాలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాజముద్రతో భూ యాజమాన్య హక్కు పత్రాలను (పట్టాదారు పాస్‌పుస్తకాలు) ప్రభుత్వం జారీ చేయనుంది. జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరఫరా చేసేందుకు రెండు విడతల్లో 79,062 కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయి. తొలివిడతలో 46,627, రెండో విడతలో 32,435 పట్టాదారు పాస్‌పుస్తకాలు చేరాయి. వీటిని కలెక్టరేట్ నుంచి జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాల ద్వారా ఆయా మండలాల కార్యాలయాలకు పంపిణీ దాదాపు పూర్తికావొచ్చింది. డివిజన్లవారీగా చిత్తూరుకు 27,169, కుప్పంకు 14,465, నగరికి 10,902, పలమనేరుకు 26,526 పుస్తకాలు తరలించారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చాక పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మ్యుటేషన్ పూర్తయిన భూములకు సంబంధించి రాజముద్రతో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలు జిల్లాకు వచ్చాయని డీఆర్వో మోహన్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వాటిని ఆయా మండలాలకు ఆర్డీవో కార్యాలయాల ద్వారా పంపించినట్లు చెప్పారు.

వైసీపీ హయాంలో తప్పులతడకగా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకం కింద రీసర్వే చేపట్టి జారీచేసిన భూ హక్కు పత్రాల్లో వివరాలు తప్పులతడకగా ఉండడం, సర్వేలో లోపాలపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అంతేగాక భూయజమాని ఫొటో కంటే అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటో పెద్దగా ఉండడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రచార ఆర్భాటమే తప్ప అప్పటి ప్రభుత్వం ఇదేమీ పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక భూహక్కు పత్రాల్లో జగన్మోహన్‌రెడ్డి ఫొటోను తొలగించి.. గతంలో మాదిరిగానే రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేస్తామని ప్రకటించి, ఆ మేరకు చర్యలు చేపట్టింది.

హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా కార్వేటినగరం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

వెదురుకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా కార్వేటినగరం నిలుస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. టీచర్‌గా ఉద్యోగ విరమణ పొందిన ఢంకా హమీద్ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఆదివారం కార్వేటినగరం హిందూ ముస్లిం కల్యాణ మండపంలో జరగ్గా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడికి వస్తే బాల్యంలో కార్వేటినగరంలో నిర్వహించిన కార్యక్రమాలు గుర్తుకు వస్తున్నాయని చెప్పారు. కార్వేటినగరంతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని తెలిపారు. దేశంలో ఎప్పుడూ మతాల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుతున్న మోదీ ఒకసారి కార్వేటినగరానికి వచ్చి హిందూ ముస్లింలను చూస్తే అప్పుడైనా జ్ఞానోదయం అవుతుందేమోనని చెప్పారు. హమీద్ తన శేష జీవితాన్ని సమాజ సేవకు ఉపయోగించాలని సూచించారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గాజుల నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి, రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చిట్టిబాబు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



హమీద్‌ను సన్మానిస్తున్న నారాయణ, నరసింహారెడ్డి తదితరులు

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దాదాపు కనుమరుగైంది. సమస్యలొస్తే సర్దుబాటు చేసే పెద్దవారు చిన్న కుటుంబాల్లో కనిపించడం లేదు. దీనివల్ల వైవాహిక జీవితంలో అంతరాలు పెరిగిపోతున్నాయి. దంపతులు తమ ఇగోలతో చిన్న చిన్న సమస్యలనే పెద్దవి చేసుకుంటున్నారు. ఈ కారణాలతో పోలీస్‌స్టేషన్ మెట్లనూ ఎక్కుతున్నారు. ఇటువంటి దంపతులకు, వారి కుటుంబీకులకు సమాజ పోకడ, చట్టాలను తెలియజేసి సమస్యలను పరిష్కరిస్తూ.. కుటుంబ పెద్దగా వ్యవహరిస్తోంది చిత్తూరులోని ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

సర్దుకుపోదాం.. రండి

- కుటుంబ తగాదాలకు పరిష్కారం
- వేదికగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ (ఫైల్‌ఫొటో)

కుటుంబంలో ఏర్పడే కలతలతోపాటు మహిళల సమస్యలను పరిష్కరించే వేదికగా మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ పనిచేస్తోంది. ఈ కేంద్రంలో పోలీసులతోపాటు రిటైర్డు ఉద్యోగులు, మానసిక నిపుణులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, మహిళా శిశు సంరక్షణ ఉద్యోగులు కలిసి కమిటీగా ఉంటారు. వీరు ప్రతి శనివారం స్టేషన్‌లో బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తారు.వీలుకాని పక్షంలోనే కేసులు నమోదు చేస్తారు.

వచ్చే కేసులిలా..

ఇంట్లో మరిదికి, అత్తామామలకు సపర్యలు చేయడం ఇష్టం లేక.. భర్త ఆడబిడ్డలకు డబ్బులిచ్చాడని భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోవడం, అత్తామామలకు కనీస గౌరవం ఇవ్వడం లేదని కోడలిపై అలక, సంపాదనంతా తన వద్దే ఇవ్వాలని భార్య అలిగి వేరే సెపాన్ని భర్తపైనెట్టి పుట్టింటికి వెళ్లిపోవడం వంటి కేసులే అధికంగా కౌన్సెలింగ్ సెంటర్‌కు వస్తున్నాయి.

గతంలో కేసు నమోదు.. ఇప్పుడు కౌన్సెలింగ్

గతంలో భార్యభర్తల గొడవ, అత్తామామలు ఇలా కుటుంబ సమస్యలతో స్టేషన్‌కు వస్తే పోలీసులు నేరుగా కేసు నమోదు చేసి కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించేవారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌లో మాత్రం ఈ విధానానికి పూర్తి విరుద్ధం. ఫిర్యాదు చేసిన వారితోపాటు ఫిర్యాదును ఎదుర్కొంటున్న వారిని సెంటర్‌కు పిలిపిస్తారు. ఇరువర్గాల సమస్యలను విన్న తర్వాత పరిష్కారం చూపుతారు. వారు ఒప్పుకోకుంటే కొంత సమయం ఇస్తారు. ఆ తర్వాత ఇరువర్గాలకు పిలిపించి చట్టం, కుటుంబ వ్యవస్థ, పెద్దలతో వ్యవహరించాల్సిన విధానం, కొన్ని సందర్భాల్లో తప్పు లేకపోయినా సర్దుకుని వెళ్లాల్సిన పరిస్థితులను వివరిస్తారు.



బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కమిటీ సభ్యులు (ఫైల్‌ఫొటో)

హింస, వేధింపులపై ఆలస్యం చేయకుండా కేసుల నమోదు

భార్యను శారీరంగా హింసించడం, కట్నం కోసం వేధించడం వంటి వాటిపై ఆలస్యం చేయకుండా కేసులను నమోదు చేస్తున్నారు.ఇలా 181 మందిపై గృహ హింస కేసు పెట్టివీరిలో 58 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఎస్పీ మణికంఠ తెలిపారు. 482 సంఘటనలకు సంబంధించి కౌన్సెలింగ్ సెంటర్‌లో కేసులు నమోదు చేయకుండా సామరస్యంగా పరిష్కార మార్గాలు చూపామన్నారు.జిల్లాకు చెందిన కేసులే కాకుండా పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకకు చెందిన 52 కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. అలాగే విదేశాల్లో ఉండి కుటుంబ సమస్యలతో ఇబ్బందులుపడిన మూడు కుటుంబాలను ఒక్కటి చేసి పంపామని తెలిపారు.మొత్తానికి ఈ సెంటర్ సత్ఫలితాలు ఇస్తోందని చెప్పారు.

కాలేజీ, పాఠశాలల్లో అవగాహన సదస్సులు

కుటుంబాల్లో తలెత్తే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో విద్యార్థులకు తెలియజేస్తున్నారు. ఏడాది కాలంలో కళాశాలలు, పాఠశాలలు, గ్రామాలు, కాలనీల్లో 748 అవగాహన సదస్సులను నిర్వహించి చిన్న వయస్సులోనే కుటుంబ వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్నారు.

నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటారన్నారు. జిల్లా అధికారులందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పీజీఆర్ఎస్ నిర్వహించాలని ఆదేశించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు ఆరు సింగిల్‌విండోల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి కార్యక్రమం జరగనుంది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ పనితీరు చూపిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(సింగిల్‌విండోల)కు అవార్డులు ప్రకటించింది. ఇందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన మదనపల్లె, వాయల్పాడు, రేణిగుంట, కోసలనగరం, జీడీనెల్లూరు, ఏర్పేడు విండోలు ఎంపికయ్యాయి. అవార్డుల స్వీకరణ కోసం ఆయా విండోల ఛైర్మన్లు, సీఈవోలు ఆదివారం విజయవాడకు బయల్దేరి వెళ్లారు. కాగా, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, సీఈవో శంకర్‌బాబులకు కూడా కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం అందింది.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.



శుక్రవారం హుండీ ఆదాయం : రూ.4.28 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 82,367

తలనీలాలు సమర్పించినవారు : 31,420

భక్తజనసంద్రం.. పాలరేవుగడ్డ

- కోలాహలంగా ఆడి పదినెట్టు వేడుకలు



ఆలయం వద్ద భక్తజన సందోహం

రామకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల పంచాయతీ పాలరేవుగడ్డ సుబ్రహ్మణ్య క్షేత్రంలో ఆదివారం ఆడి పదినెట్టు వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఆలయంలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు తరలిరావడంతో పాలరేవుగడ్డ జనసంద్రంగా మారిపోయింది. వందలాది మంది భక్తులు కుండ కావళ్లు, నెమలి కావళ్లు, వీపుతేర్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు వీపులకు కొక్కేలు తగిలించుకుని క్రేన్లకు వేలాడుతూ, దవళ్లకు శూలాలు, శరీరాలకు నిమ్మకాయలు గుచ్చుకుని ఆలయానికి చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాలను ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, నాగభూషణం, జయశంకర్, సత్తి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూశారు.



వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



వీపునకు కొక్కేలు తగిలించుకుని క్రేన్‌కు వేలాడుతున్న భక్తుడు

చిత్తూరులో కర్ణాటక గవర్నర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆదివారం బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన చిత్తూరుకు చేరుకున్నారు.ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో దాదాపు 4 గంటల పాటు విశ్రాంతి తీసుకున్నారు. అతిథి గృహానికి చేరుకున్న గవర్నర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి కాణిపాకం వినాయస్వామి చిత్రపటాన్ని అందించారు. అనంతరం గవర్నర్ చిత్తూరు నుంచి తిరుపతికి బయల్దేరి వెళ్లారు.



గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌కు వరసిద్ధుడి చిత్రపటాన్ని అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

లగేజీ వ్యాను బోల్తా

- రోడ్డు పాలైన టమోటాలు
- రైతుకు స్వల్పగాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మోదుగులపల్లె మార్గంలో టమోటాలను తరలిస్తున్న లగేజీ వ్యాను అదుపుతప్పి బోల్తాపడటంతో రైతుకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా.. మోదుగులపల్లె పంచాయతీ కంటేపల్లెకు చెందిన రైతు కుమార్ తన టమోటాలను పుంగనూరు మార్కెట్‌కు లగేజీ వ్యానులో తరలిస్తుండగా కంటేపల్లె క్రాస్ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రైతుకు స్వల్ప గాయాలవగా, వాహనంలోని టమోటాలన్నీ రోడ్డుపాలయ్యాయి. దీంతో సుమారు రూ.లక్ష నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



లగేజీ వ్యాను బోల్తా పడటంతో రోడ్డు పాలైన టమోటాలు

13 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన 24 గంటల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం 13 మండలాల్లో కురిసింది. మండలాల వారీగా.. చిత్తూరు అర్బన్‌లో 16.8, గంగవరంలో 13.4, చిత్తూరు రూరల్‌లో 8, రొంపిచెర్లలో 7.2, నగరిలో 6.4, సదుంలో 4.8, పలమనేరులో 4, పెద్దపంజాణి, కుప్పంలో 2.2, పులిచెర్లలో 1.8, పూతలపట్టులో 1.2, బంగారుపాళ్యం, గుడిపాలలో ఒక మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

భక్తులతో కిక్కిరిసిన 'బోయకొండ'

చౌడేపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారికి కృష్ణగిరికి చెందిన భక్తుడు అరుణ్‌కుమార్ దంపతులు నెమలి పింఛాలు, రూ.5 కాయిన్లతో పూలహారాన్ని బహూకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

రాజ్యాంగానికి పెనుముప్పు!

- ఎస్సీ మాల ఉద్యోగుల సంఘ నాయకుల విమర్శ
- కుప్పం నుంచి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ప్రారంభం

కుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో భారత రాజ్యాంగానికి పెనుముప్పు వాటిల్లిందని ఎస్సీ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబు, కార్యదర్శి యమలా సుదర్శన్ విమర్శించారు. ఎస్సీ మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం దాకా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను తలపెట్టారు. ఆదివారం కుప్పంలో ఈ యాత్రను కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. వెంటనే ఎస్సీ వర్గీకరణను ఆపాలని డిమాండు చేశారు. పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా దళితులకు 20శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా పాదయాత్ర ఆగదని స్పష్టం చేశారు. అంతకుముందు చింతామోహన్ మాట్లాడుతూ.. దేశంలోనూ, రాష్ట్రంలోనూ దళితులందరూ కన్నీటితో ఉన్నారన్నారు. ఈ పాదయాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మాల ఉద్యోగుల సంఘం నాయకులు అన్నవరపు కిశోర్, చెన్నకేశవులు, కులాయప్ప, మహానంద, వెంకట్, దుగ్గాని జయరాం, ప్రకాశ్, తాళ్లపాక దాము తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

గ్రామాలను కబళిస్తున్న కాలుష్య భూతం

● సారవంతమైన భూములు నిర్వీర్యం

కుప్పం మండలంలో ఒక పార్శ్వంలోని గ్రామాలను కాలుష్య భూతం కబళిస్తోంది. సారవంతమైన భూములను నిస్సారంగా మార్చడమేకాక, నీటిని సైతం కలుషితం చేస్తూ గ్రామీణుల ఆరోగ్యాలను హరిస్తోంది. కాలుష్య నియంత్రణ పద్ధతులు పాటించని పరిశ్రమ వల్లే తమకీ దుస్థితి పట్టిందని, వెంటనే పరిశ్రమ యాజమాన్యాన్ని హెచ్చరించి తగు చర్యలు తీసుకోవాలని తరచూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. - కుప్పం, ఆంధ్రజ్యోతి



పరిశ్రమ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగలు

కుప్పం మండల పరిధిలోని వసనాడు పంచాయతీ పరిధిలో సుమారు 15 ఏళ్లుగా ఒక స్టీల్ ఫ్యాక్టరీ నడుస్తోంది. ఒకే యూనిట్‌గా ప్రారంభమైన ఈ పరిశ్రమ ప్రస్తుతం మూడు యూనిట్లకు విస్తరించింది. అయితే కాలుష్య నియంత్రణ పద్ధతులు మాత్రం పాటించడంలేదన్నది గ్రామస్తుల ఆరోపణ. పరిశ్రమ నుంచి వెలువడే పొగ, ఇతర వ్యర్థాలను శుద్ధి చేయకుండానే వాతావరణంలోకి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా స్టీల్ పరిశ్రమనుంచి వెలువడే నల్లటి దట్టమైన పొగలు పరిసర గ్రామాలను ఆక్రమించి ఊపిరి సలపకుండా చేస్తున్నాయి. అంతేకాక ఈ పరిశ్రమలనుంచి వెలువడే వ్యర్థ జలాలను కూడా ఇలాగే వదిలేయడంవల్ల భూములను విషపూరితం చేస్తున్నాయి. మండలంలోని వసనాడుతోపాటు గొల్లపల్లె, జోగిండ్లు, రామబద్రూనూరు, పైపాళ్యం, నడిమూరు, చిన్న వసనాడు, ములకలపల్లె, బోదగుట్టపల్లె, బిరుదనపల్లె, గోపనపల్లె తదితర 12 గ్రామాలు ఈ పరిశ్రమ కాలుష్యానికి ప్రభావితమవుతున్నాయి. ఎంతో సారవంతమైన భూములు నిస్సారంగా మారి సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. భూగర్భజలాలు సైతం విషతుల్యమై వాటిని తాగుతున్న గ్రామాల్లోని పిల్లలు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. చివరకు పంట పొలాల్లో సాగు చేస్తున్న గడ్డి కూడా పశువులు తినలేకపోతున్నాయి. తిన్న పశువులు అనారోగ్యంతో మృతి చెందుతున్నాయి. స్టీల్ ఫ్యాక్టరీ వల్ల ఎదురవుతున్న కాలుష్య సమస్యపై ఇటీవల పరిసర గ్రామాల ప్రజలు కడా పీడీ వికాస్ మర్మత్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.



కడా పీడీకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు (ఫైల్ ఫొటో)

గతంలో కూడా పలుమార్లు ఇటువంటి ఫిర్యాదులే అప్పటి అధికారులకు చేసినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకమీదటైనా పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కనువిందు చేసిన కూచిపూడి నృత్యం



తిరుమల, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందున్న నాద నీరాజనం వేదికపై ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. తిరుపతికి చెందిన కుమారి భానుజ బృందం ఈ ప్రదర్శన ఇచ్చింది. శ్రీమన్నారాయణ, అన్ని మంత్రములు.., వంటి అన్నమయ్య కీర్తనలకు వీరి బృందం అద్భుత నృత్య భంగిమలతో చూపరులను ఆకట్టుకున్నారు. టీటీడీ జేఈవో వీర బ్రహ్మం కుమార్తె శ్రేయ జోషి తన ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలపై కార్యాచరణ



సమావేశంలో తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది కాలంలో నిర్వహించతలపెట్టిన తైక్వాండో పోటీలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపట్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. ఆదివారం ఏర్పాటు చేసినసమావేశంలో తైక్వాండో క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు శిక్షణ, సెమినార్స్ నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ధనంజయులు, ట్రెజరర్ శ్రీనివాసులు, శంకర్, వాసుదేవాచారి, రవి, వెంకటరమణ, సురేష్, సంతోష్, లోకేశ్, గౌతమ్, పృథ్వి, విజయ్, అనిల్ పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ.. పట్టివేత



శ్రీనివాసన్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సబ్‌జైలు నుంచి పరారైన రిమాండ్ ఖైదీని కొద్ది గంటల్లోనే పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నాగలాపురంలో గత నెల 20వ తేదీ రాత్రి ముస్తఫా టెక్స్‌టైల్స్‌లో దొంగలు చొరబడి వస్త్రాలు, నగదు దోచుకెళ్లారు. ఈ కేసును ఎస్‌ఐ సునీల్ దర్యాప్తు చేస్తున్నారు. దుకాణంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు చిత్తూరు జిల్లా విజయపురం మండలం కాళీకాపురానికి చెందిన మహేష్, పిచ్చాటూరు మండలం కారూరుకు చెందిన శ్రీనివాసన్, సూర్యగా గుర్తించారు. వీరిని గతనెల 29న నారాయణరాజు కండ్రిగ సమీపాన పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం వీరిని సత్యవేడు సబ్‌జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం జైలులోని బ్యారక్‌లను శుభ్రం చేసేందుకు సూపరింటెండెంట్ కరీముల్లా ఖైదీలను బయటకు వదిలారు. ఇదే అదనుగా శ్రీనివాసన్ పోలీసుల కళ్లుగప్పి జైలు బాత్రూం గోడపైకి ఎక్కి తహసీల్దార్ కార్యాయం వెనుకవైపు దూకి పరారయ్యాడు. శ్రీనివాసన్ కనబడకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శ్రీనివాసన్ నాగలాపురంలోని తన ప్రియురాలు ఇంట్లో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. రిమాండ్‌లో ఉండి తప్పించుకున్నందున శ్రీనివాసన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ కరీంబాషా తెలిపారు. కాగా, సత్యవేడు సబ్‌జైలు నుంచి గతంలోనూ ఇద్దరు రిమాండ్ ఖైదీలు తప్పించుకోగా వారిని కూడా ఇలానే గాలించి పట్టుకున్నారు. ఈ సబ్‌జైలు గోడలు తక్కువ ఎత్తులో ఉండడం కారణం కావచ్చని పోలీసులు భావిస్తున్నారు.

రేపు ఐసర్ 6వ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య

ఏర్పేడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐసర్ (భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ) 6వ స్నాతకోత్సవం మంగళవారం ఐసర్‌లో జరగనుందని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్దనున్న ఐసర్ ప్రాంగణంలో ఆదివారం ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఐసర్ ఏర్పడి పదేళ్లయిందన్నారు. ఈసారి స్నాతకోత్సవంలో ఐసర్‌లో కోర్సులు పూర్తి చేసిన 255 మంది విద్యార్థులకు పట్టాలను అందజేస్తామన్నారు. ముఖ్య అతిథిగా గోదావరి బయో రిఫైనరీస్ చైర్మన్ సమీర్ సోమైయా, ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ ఝిల్లుసింగ్‌యాదవ్ హాజరవుతారన్నారు. 2015లో ఐసర్ ప్రారంభించినపుడు బీఎస్-ఎంఎస్ కోర్సును మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం ఎన్నో పీహెచ్‌డీ స్థాయి ప్రోగ్రామ్‌లు ప్రారంభించామన్నారు. మెల్‌బోర్న్‌యూనివర్సిటీతో ఇంటర్నేషనల్ అకాడమిక్ ప్రోగ్రాం, ఆస్ట్రేలియా, మెల్‌బోర్న్ వర్సిటీలో సంయుక్తంగా అంతర్జాతీయ రీసెర్చ్ కోర్సును త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నాలుగేళ్ల ఈ కోర్సులో చేరే విద్యార్థులు రెండేళ్ల పాటు ఐసర్‌లో మరో రెండేళ్లు మెల్‌బోర్న్‌లో అభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది నాలుగేళ్ల బ్యాచురల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఎకనామిక్ అండ్ స్టాటిస్టికల్ సైన్సెస్ (బీఎస్-ఈఎస్ఎస్), రెండేళ్ల ఎంఎస్(మాస్టర్స్ బైరీసెర్చ్) కోర్సులను ప్రారంభించనున్నామన్నారు. నేచర్ ఇండెక్స్-2025 ర్యాంకింగ్‌లో తిరుపతి ఐసర్ దేశంలోనే 33వ స్థానంలో నిలిచిందన్నారు.

సంస్కృత వర్సిటీలో ద్వాదశ కలశ స్థాపన

- పలువురు ఆచార్యులకు సన్మానం



సంస్కృత ఆచార్యులను సన్మానిస్తున్న సాధు భద్రేశస్వామి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీలోని అక్షర పురుషోత్తమ మండపంలో ద్వాదశ కలశ స్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు రోజుల పాటు నిర్వహించే భాషోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రుద్ర ఏకాదశి అనే వైదిక కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యాపకులతో శాస్త్రీయ చర్చాగోష్ఠి నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. సంప్రదాయ శోధ సంస్థానం అధ్యక్షుడు స్వామి నారాయణ నేతృత్వంలో ఈ చర్చాగోష్ఠి సాగింది. ప్రొఫెసర్ గణపతి భట్, ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పాండా తదితరులు పాల్గొన్నారు. సాధు భద్రేశ స్వామి చేతుల మీదుగా దర్శన సంకాయ డీన్ విష్ణుభట్టాచార్యులు, పరమాచార్య గురుకుల కేంద్ర డైరెక్టర్ గణపతిభట్, ద్వైత, అద్వైత వేదాంత విభాగాధ్యక్షుడు నారాయణ, సతీష, ఆగమ విభాగ ప్రొఫెసర్లు రంగరామానుజాచార్యులు, నాగరాజు భట్, యోగా విభాగాధ్యక్షుడు డాక్టర్ తపన్‌కుమార్, డాక్టర్ షిండే మనోజ్ అంగద్‌ను సన్మానించారు.

ఇద్దరి ఆత్మహత్య

● కడుపునొప్పి తాళలేక ఒకరు, కుటుంబీకులు మందలించారని మరొకరు



పవన్ కల్యాణ్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం/చిత్తూరు అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. బంగారుపాళ్యం మండలంలోని తుంబపాళ్యం గ్రామానికి చెందిన మార్కొండయ్య కుమారుడు పవన్ కల్యాణ్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆ నొప్పిని భరించలేక శనివారం రాత్రి తమ పొలం వద్ద పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు గమనించి చీలాపల్లె సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. ● చిత్తూరు శ్రీనగర్‌కాలనీకి చెందిన మోహన్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. రెండ్రోజుల కిందట మద్యం తాగి ఇంటికి వస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి, జరిమానా విధించారు. ఈ విషయం తెలిసిన కుటుంబీకులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. తమ ఇంటి పక్కన నిర్మాణంలో ఉన్న గృహంలోకి శనివారం పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు చిత్తూరు ఆస్పత్రికి, ఆపై మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మోహన్‌రెడ్డి ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు దేవేంద్ర ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది ఎర్రచందనం దుంగల స్వాధీనం: ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖాజీపేట సమీపంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 9 ఎర్రచందనం దుంగలను, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం ఎఫ్‌బీవో లింగానాయక్‌తో కలిసి శనివారం రాత్రి నుంచి ఖాజీ పేట పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. పత్తూరు సమాధులు చేరుకునే సరికి ఒక కారులో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్‌చేస్తూ పోలీసుల కంటపడ్డారు. చుట్టుముట్టే ప్రయత్నం చేయగా ఒకరు దొరికారు. మిగిలిన వారు పారిపోయారు. అతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్‌ను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

బసినాయన చెరువులో విషప్రయోగం



మృతి చెందిన చేపలు

సోమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు బసినాయన చెరువులోని చేపలు ఆదివారం విష ప్రయోగంతో మృత్యువాత పడ్డాయి. మధ్యాహ్నం చెరువులోని పలు చేపలు మృతి చెంది నీటిలో తేలియాడటంతో గుర్తించారు. చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో లీజుకు తీసుకున్న వ్యక్తి చేపల అమ్మకాలు చేపట్టారు. కిలో చేపలు రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నాడు. ఈక్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విషప్రయోగం చేయడంతో పలు చేపలు మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు తెలిపారు.

వరసిద్ధుడి సేవలో పీసీసీఎఫ్



పీసీసీఎఫ్ శ్రీధర్‌కు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ ఎస్ఎస్ శ్రీధర్ దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవీఆర్ కృష్ణారావు కూడా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దొంగలు దొరకలేదని కేసులు క్లోజ్..!

● వైసీపీ హయాంలో 50కిపైగా మూసేసిన వైనం
● స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు
● ఇప్పుడు మేమేం చేసేదంటున్న పోలీసులు

● తిరుపతి నగరం లక్ష్మీపురానికి చెందిన జి.శశివదన కుటుంబంతో కలసి 2022 సెప్టెంబరు 22న స్వగ్రామంలో శుభ కార్యానికి బయలుదేరారు. ఇంట్లోని దాదాపు 500 గ్రాముల బంగారు నగలు, మరో 120 గ్రాముల వెండి వస్తువులు, దాదాపు రూ.2.40 లక్షల నగదు సూట్ కేసులో ఉంచుకుని తిరుపతి ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేస్తున్న సమయంలో దొంగ ఏమార్చి.. సూట్‌కేసును అపహరించుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో (421-2022) కేసు నమోదైంది.

● తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్వీపీ కాలనీలో కాపురమున్న ఎస్వీబీసీలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.విమల 2019 ఫిబ్రవరి 26న ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లారు. అక్కడ్నుంచి తన కుమారుడు చదువుతున్న విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లారు. ఇంటికి వేసిన తాళాన్ని దుండగులు పగులగొట్టి దాదాపు రూ.2.80 లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ (89-2019) కేసు నమోదు చేశారు.

- ఈ రెండు దొంగతనాల కేసుల్లో దొంగలు దొరకలేదంటూ గతేడాది ఎన్నికల ముందే కేసు మూసేశారు. ఇలా జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మూసేసిన కేసులు (అన్ డిటెక్టివ్) 50కి పైగా ఉన్నట్లు సమాచారం. తమకు న్యాయం జరక్క బాధితులు లబోదిబోమంటున్నారు.

ఎంతో కష్టపడి.. పైసా పైసా కూడబెట్టుకున్న సొత్తు దొంగల పరమైతే ఆ బాధితుల వేదన ఎంతో? ఎప్పటికైనా పోలీసులు రికవరీ చేసిస్తారన్న ఆశతో ఏళ్ల తరబడి చూసిన వారికి.. తమ కేసులు మూసేశారని తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో దొంగతనం, దోపిడీ, బ్యాగులు ఎత్తుకెళ్లడం వంటి కేసుల్లో రికవరీపై పోలీసులు పెద్దగా దృష్టి పెట్టలేదన్న విమర్శలున్నాయి. దొంగలు దొరికినప్పుడు చూద్దాం.. అనుకుంటూ ఉదాసీనంగా ఉండిపోయారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరకు.. ప్రతి నెలా జరిగే ఎస్పీ నేర సమీక్షా సమావేశంలో సమాధానం ఎందుకు చెప్పుకోవాలని భావించారు. చివరకు దొంగలు దొరకలేదంటూ కేసులు మూసేశారు. ఇలా 2019 నుంచి 2024 వరకు.. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో మూసేసిన కేసులు ఉండటం గమనార్హం. అప్పట్లో పోలీసు బాస్‌లు కేసులు కూడా రికవరీపై దృష్టి సారించకపోవడంతో కిందస్థాయిలోనూ అదే నిర్లక్ష్యంతో ఉన్నారన్న ఆరోపణలున్నాయి. తమ కేసులు మూసేసినా.. పలువురు బాధితులు ఇప్పటికీ పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. అప్పట్లో దొంగతనం జరిగి.. కేసులూ మూసేస్తే ఇప్పుడు మేము ఏం చేయాలంటూ కొందరు పోలీసులు బాధితులను ప్రశ్నిస్తున్నారు. ఇంతకాలం మీరేం చేస్తున్నారు. ఇప్పుడు మా వద్దకొచ్చి మొత్తుకుంటే ఎలాగంటున్నారు. దీనిపై గత సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఓ బాధితురాలు ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన విహార యాత్ర

● ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొన్న బైకు ● ఇద్దరు యువకుల దుర్మరణం ● మరొకరికి తీవ్రగాయాలు





భవానిప్రసాద్, ముదూరు గణేష్ (ఫైల్ ఫొటోలు)

దొరవారిసత్రం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు. సరదాగా గడుపుదామని ఆ ముగ్గురు మిత్రులు బైకుపై విహార యాత్రకు బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో యల్లంపాటి భవానిప్రసాద్(22), ముదూరు గణేష్(17) మృతిచెందగా, బట్టా అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాద ఘటన తిరుపతి జిల్లాలోని దొరవారిసత్రం మండలం అక్కరపాక పెట్రోల్ బంకు ఎదురుగా జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ముగ్గురిదీ నాయుడుపేట మండలం పుదూరు గ్రామం. భవానిప్రసాద్ చెన్నైలోని దానిష్ అహ్మద్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఈసీ ఫైనలియర్ చదువుతున్నాడు. అదే కాలేజీలో గణేష్ బీటెక్ ఫస్టియర్‌లో చేరాడు. సెలవు కావడంతో సరదాగా వరదయ్యపాళెం మండలం ఉబ్బలమడుగు వెళదామనుకున్నారు. మరో స్నేహితుడు అనిల్‌తో కలిసి స్పోర్ట్స్ బైక్‌లో బయల్దేరారు. అతివేగంగా వెళుతున్న వీరు అక్కరపాక పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ముందు వెళుతున్న కంటైనర్ లారీని ఢీకొన్నారు. రోడ్డుపై పడిపోవడంతో తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే హైవే పోలీసుల సాయంతో 108 ద్వారా ముగ్గురినీ సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భవానిప్రసాద్, గణేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలు విరిగి తీవ్రంగా గాయపడిన అనిల్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలం పరిశీలించారు. ఇద్దరు యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులది ఒకే గ్రామం కావడంతో.. వారంతా సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి చేరుకొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనతో ఆస్పత్రి ప్రాంగణం విషాదంగా మారింది. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు.

అండగా నిలుస్తారనుకుంటే..!



గణేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

వాళ్లది నిరుపేద కుటుంబం. కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. ఉద్యోగులై కుటుంబానికి అండగా నిలుస్తారనుకున్న ఇద్దరు యువకులు.. విగతజీవులుగా మారడంతో రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం నింపింది. అక్కరపాక వద్ద ప్రమాద మృతులు.. గాయపడిన యువకుడిది నాయుడుపేట మండలం పుదూరు. ఆదివారం సాయంత్రం రెండు మృతదేహాలు గ్రామానికి రావడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.

● బాలకృష్ణ, విజయమ్మ దంపతుల కుమారుడు భవానీ ప్రసాద్. ఇతడి సోదరి జ్వాలా. బాలకృష్ణ ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించడంతో పాటు ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. ఈ సంవత్సరంతో కుమారుడి బీటెక్ పూర్తయితే.. ఉద్యోగంలో చేరి అండగా నిలుస్తాడని ఆ కుటుంబం భావించింది. ఇంతలో ఈ ప్రమాదం వారి కలలను ఛిద్రం చేసింది.

● ఇక, కుమారుడు గణేస్‌తో కలిసి సుబ్బమ్మ నాలుగేళ్ల కిందట శ్రీకాళహస్తి అగ్రహారం నుంచి పుదూరుకు వచ్చారు. కూలి పనులు చేసుకొంటూ కొడుకుని చదివిస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడి మరణం ఆమెను కుంగదీసింది.

● గాయపడిన అనిల్‌దీ పేద కుటుంబమే. ఇతడి తండ్రి హోటల్‌లో పనిచేస్తున్నారు. అదే హోటల్‌లో తనూ పనికి చేరాడు అనిల్. ఇంతలో తీవ్ర గాయాలతో ఆస్పత్రికి చేరారు. ఆస్పత్రి ఖర్చులు భరించడం ఆ కుటుంబానికి తలకుమించిన భారమవుతోంది.

- నాయుడుపేట టౌన్, ఆంధ్రజ్యోతి

పాఠశాల స్థలంలో దుకాణాలు

● విద్యార్థుల రాకపోకలకు అవస్థలు



బాలికోన్నత పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట దారిలేకుండా అంగళ్లు

పలమనేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పట్టణ నడిబొడ్డున మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధాన ద్వారం ముందు ఆక్రమణలు తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. దాదాపు ఎనిమిది వందలకు పైగా విద్యారులు పాఠశాలలో చదువుకుంటున్నారు. పాఠశాలకు ఒకే ఒక దారి ఉండగా ఆ ప్రధాన ద్వారం ముందు వ్యాపారులు దారిలేకుండా ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. విద్యార్థినులు పాఠశాల లోపలికి వెళ్లాలన్నా.. ఇళ్లకు వెళ్లాలన్నా వ్యాపారుల ఆక్రమణలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారం సంత జరిగే సమయంలో ఈ దారి మరింత ఆక్రమించుకొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి పాఠశాల ప్రధాన ద్వారం ముందు ఎటువంటి ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నేడు సింగిల్‌విండో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



మహ్మద్‌రఫీ



సురేష్



అంజప్ప

రామకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం సింగిల్ విండో త్రిసభ్య కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఉదయం 11 గంటలకు రామకుప్పంలోని సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో జరిగే కార్యక్రమంలో చైర్మన్‌గా గొరివిమాకులపల్లెకు చెందిన మహ్మద్‌రఫీ, డైరెక్టర్లుగా చెల్దిగానిపల్లెకు చెందిన సురేష్, గాంధీనగరానికి చెందిన అంజప్పలు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సీఈవో కోదండ తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నికకు సహకరించాలి

రామకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ ఉప ఎన్నికలు సజావుగా సాగేలా అందరూ సహకరించాలని కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జూలై 30 నుంచి ఈనెల 1 వరకు నామినేషన్ల ప్రక్రియ సాగిందని.. ఈ ప్రక్రియకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అలాగే ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల కోడ్‌తోపాటు 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని తెలిపారు.

శాంతిపురం సింగిల్ విండో చైర్మన్‌గా గోపాల్

● ఇద్దరు సభ్యులతో కలిసి నేడు ప్రమాణస్వీకారం



గోపాల్

శాంతిపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల వ్యవసాయ సహకార బ్యాంకు చైర్మన్‌గా గోపాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయనతో పాటు శివరామపురం పంచాయతీకి చెందిన శాంతంపల్లె దాము, చెంగుబల్ల పంచాయతీ శివకురుబూరు గ్రామానికి చెందిన హరీష్‌కుమార్‌లను కూటమి ప్రభుత్వం సింగిల్ విండోకు త్రిసభ్య కమిటీని ప్రకటించింది. వీరు సోమవారం సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బాష్యం విశ్వనాథనాయుడు, ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని టీడీపీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు తప్పకుండా హాజరు కావాలని వారు కోరారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం



పలమనేరు తాలూకా నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం

పలమనేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు తాలూకా 4వ తరగతి ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. పలమనేరు ఎన్జీవో సంఘ కార్యాలయం వద్ద జరిగిన ఈ ఎన్నికల్లో సంఘ నూతన అధ్యక్షులుగా పి.బి.బాలసుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులుగా సాంబయ్య, కార్యదర్శిగా పి.రవి, ఉపాధ్యక్షులుగా డి.అనిత, పి.పురుషోత్తం, సంయుక్త కార్యదర్శిగా హరీష్, ప్రచార కార్యదర్శిగా గురుమూర్తిలను ఎన్నుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలమనేరు ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్ పాల్గొన్నారు.

● బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు వెంటనే చెల్లించడంతో పాటు పీఆర్‌సీ, ఐ.ఆర్ సమస్యలు పరిష్కరించాలని పలమనేరు ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు, జిల్లా సంఘ నాయకులు లక్ష్మీపతి యాదవ్ డిమాండు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా నేటికి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపక పోవడం విచారకరమన్నారు. సంఘ జిల్లా అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు హరికృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

వైసీపీ గ్రామ కమిటీల ఎంపిక

చౌడేపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పలు పంచాయతీల్లో వైసీపీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆమినిగుంట పంచాయతీ అధ్యక్షులుగా శ్రీనివాసులు, పరికిదొన పంచాయతీ అధ్యక్షులుగా ప్రకాష్, పందిళ్లపల్లె పంచాయతీ అధ్యక్షులుగా శ్రీరాములురెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరమణ, రుక్మిణమ్మ, మిద్దింటి శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మామిడి కొమ్మల కత్తిరింపు

● కూలీల డిమాండుతో రైతుల కష్టాలు



కొమ్మలను కత్తిరించిన మామిడిచెట్లు

సోమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మామిడి సీజన్ ముగియడంతో తోటల్లో కొమ్మల కత్తిరింపులకు రైతులు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే కొమ్మల కత్తిరింపులకు కూలీల డిమాండు పెరిగింది. కొమ్మలు కత్తిరించడానికి మెలకవులు తెలిసిన నిపుణులైన కూలీలు ఉండటంతో వారికి డిమాండు అధికమైంది. వారికి దినకూలీ రూ. 800 వరకు చెల్లించాల్సి వస్తోంది. సోమల మండలంలోనే 5 వేల ఎకరాల్లో మామిడి తోటల సాగు విస్తరించి ఉంది. కొమ్మలు కత్తిరింపు కూలీలకు మరో రెండు నెలలు డిమాండు ఉంటుంది. కొమ్మలు కత్తిరించిన అనంతరమే తోటల్లో దుక్కులు చేస్తారు. కూలీలు అందుబాటులో లేకపోవడంతో కొందరు రైతులు సొంతంగానే కొమ్మల కత్తిరింపునకు శ్రీకారం చుట్టారు. ఐదేళ్లుగా ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రాయితీతో అందజేసే కొమ్మల కత్తిరింపు పరికరాలు అందజేయలేదు. దీంతో ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు పరికరాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఉపాధిహామీ పథకంతో కొమ్మల కత్తిరింపునకు కూలీలకు పనులు కల్పించి రైతులకు చేయూతనివ్వాలని మామిడి రైతులు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో 'మానవత' ఆదర్శం



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

పుంగనూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉచిత సేవా కార్యక్రమాల్లో జిల్లాలోనే పుంగనూరు యూనిట్ ముందుంటూ ఆదర్శంగా నిలుస్తున్నట్లు సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జామకాయల కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జరిగిన మానవత సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆపద సమయాల్లో బాధితులను ఆదుకోవడానికి, వారికి ధైర్యం చెప్పడానికి విశ్రాంత ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి ప్రారంభించిన మానవత సంస్థలు పలుచోట్ల ఏర్పడి నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు అందిస్తున్నాయని చెప్పారు. మృతిచెందిన వారి కోసం ఫ్రీజర్ బాక్సులు, అంతిమయాత్రకు శాంతిరథం ఉచితంగా ఇస్తున్నామని, వీటితోపాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. పుంగనూరులో ఫ్రీజర్ బాక్సులను ఉచిత రవాణా చేయడానికి ఒక వాహనం సమకూర్చుకోవాల్సిన అవసరముందన్నారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రభాకర్, ఏసీ నారాయణరెడ్డి మాట్లాడుతూ కులమత వర్గాలకు అతీతంగా అవసరార్థులకు మానవత సేవలు విస్తృతం చేయడానికి అందరి సహకారం అవసరమని చెప్పారు. సంస్థకు సహకరిస్తున్న దాతలను వారు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ నందీశ్వరయ్య, ప్రతినిధులు కె.బాలసుబ్రహ్మణ్యం, భక్తవత్సల రాజు, హరినాథరెడ్డి, చెంగారెడ్డి, సరస్వతమ్మ, హెచ్‌ఎం రుద్రాణి, జీవీ.రమణ, బాలాజీ, జగన్మోహన్‌రెడ్డి, వనిత, మీనాకుమారి, రాజేశ్వరి, రామనాథం, సుబ్బన్న, కమలమ్మ, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్వహణకు రూ.51 వేల విరాళం



ఈవో ఏకాంబరానికి చెక్కు అందిస్తున్న దాత అరుణ్‌కుమార్ దంపతులు

చౌడేపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ గోశాల నిర్వహణ కోసం రూ.51 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కృష్ణగిరికి చెందిన అమ్మవారి భక్తుడు అరుణ్‌కుమార్, మౌనిక దంపతులు విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్చకుడి హఠాన్మరణం



వెంకటేష్ మూర్తి (ఫైల్ ఫొటో)

పెద్దపంజాణి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలం చళమంగళం గ్రామానికి చెందిన ప్రధాన అర్చకులు వెంకటేష్ మూర్తి (42) ఆదివారం హఠాన్మరణం చెందారు. మండలంలో పలు దేవాలయాలకు ప్రధాన అర్చకులుగా ఉంటూ పలమనేరు పట్టణంలోని శ్రీసత్యనారాయణస్వామి ఆలయ అర్చకులుగా ఉంటున్నారు. పూజాకార్యక్రమాలు, పెళ్లిళ్ల, గృహప్రవేశాలకు హాజరవుతూ జ్యోతిష్యంలో తగిన ప్రావీణ్యం పొందారు. దీంతో క్షణం తీరిక లేకుండా గడిపేవారు. వారం రోజుల క్రితం ఛాతీలో నలతగా ఉండటంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటూ ఆదివారం మృతి చెందారు.

8న వరలక్ష్మీవ్రతం

పుంగనూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ఈనెల 8న టీటీడీ ఆధ్వర్యంలో సౌభాగ్యం కార్యక్రమంతో వరలక్ష్మీవ్రతం జరుగుతుందని ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. మహిళా భక్తులకు అమ్మవారి కుంకుమ, పసుపుదారం, గాజులు, కంకణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా పాలేటమ్మ జాతర





అలంకరణలో పాలేటమ్మ ఉత్సవమూర్తి , సోమలలో పుష్ప పల్లకీ బండ్లు

సోమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి భక్తులు జాగరణలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సోమల, ఎగువపల్లె తదితర గ్రామాల నుంచి మొక్కుబడులతో చాందినీ బండ్లు, అన్నదాన బండ్లు, చెక్క భజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అలాగే పలు గ్రామాల మహిళలు పొంగళ్లు, పిండిదీపాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఆలయ ధర్మకర్త నరసింహులు, ఎస్ఐ శివశంకర కార్యక్రమాలను పర్యవేక్షించారు.

భూతగాదాలో ఇరువర్గాల ఘర్షణ

పుంగనూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడి ఆదివారం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. బాధితుల కథనం మేరకు... మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్ట గ్రామానికి చెందిన వీరప్ప కుమారుడు వెంకటరమణ, అదే గ్రామానికి చెందిన సుబ్బన్న కుమారుడు మోహన్, అతని భార్య గౌతమి పొలం వద్ద ఘర్షణ పడి కట్టెలతో కొట్టుకోవడంతో ముగ్గురు గాయపడ్డారు. ఇరువర్గాలకు చెందిన ముగ్గురూ చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్సలు పొందుతున్నారు.

దళితుడిననే గెంటేశారు..!

● ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విధివిధానాలకు తాను వ్యతిరేకంగా ప్రవర్తించలేదని పెద్దపంజాణి ఎంపీపీ రెడ్డెప్ప పేర్కొన్నారు. ఆదివారం పెద్దపంజాణి మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత కొంత కాలంగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నానన్నారు. ఇదే అదనుగా తనపై గిట్టని వారు ఉద్దేశపూర్వకంగా చేసిన ఆరోపణలు ఏమాత్రం విచారణ చేయకుండా, నోటీసు ఇవ్వకుండా, నిజానిజాలు తెలుసుకోకుండా పార్టీ నుంచి బహిష్కరించడం అత్యంత దారుణమన్నారు. ఏ తప్పు చేయకున్నా కేవలం దళితుడిననే కారణంతో దూరం పెట్టారని తెలిపారు. పార్టీ విధివిధానాలకు వ్యతిరేకంగా ప్రవర్తించాననే ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న రామకుప్పం బజారువీధి

శాంతిపురం, రామకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా కుప్పం నియోజకవర్గంలో వాన జాడ కానరాలేదు. వర్షాభావం కారణంగా చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఎండిపోయి, కళాహీనంగా దర్శనమిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు గత నాలుగు రోజులుగా ఇక్కడ ఎండలు మండిపోయి వేసవిని తలపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ వాతావరణం చల్లగా ఉంటున్నా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మిట్ట మధ్యాహ్నం వేళ ఎండ వేడిమికి తట్టుకోలేక జనం బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండలు ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి తగ్గిపోయి సాగు, తాగునీటికి సమస్యలు ఎదురవుతాయని రైతులు, సామాన్య ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పూర్తిగా వర్షాధారిత ప్రాంతమైన కుప్పం నియోజకవర్గం ప్రజలు హంద్రీ-నీవా కాలువతో వచ్చే కృష్ణాజలాల కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో కాలువ లైనింగ్ పనులు అయితే పూర్తి కావచ్చాయి. కాలువలో వచ్చే జలాలను చెరువులకు మళ్లించే ఏర్పాట్లు ఎక్కడా చేసినట్లు దాఖలాలు లేవు. కాలువ నుంచి చెరువులకు జలాలు మళ్లింపు కోసం తగు ఏర్పాట్లను సత్వరం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వినాయక చవితికి విగ్రహాలు సిద్ధం



సోమలలో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్న కళాకారులు

సోమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం వారపు సంత సమీపంలో పలు రకాల వినాయక విగ్రహాలను కళాకారులు సిద్ధం చేస్తున్నారు. ఆగస్టు 27న వినాయక చవితి వేడుకలకు విగ్రహాలు రూ.1000 నుంచి రూ. 40 వేలు వరకు వివిధ రకాల్లో తయారు చేస్తున్నారు. గత 12 సంవత్సరాలుగా ఇక్కడ విగ్రహాలను తయారు చేస్తూ అడుసుపల్లెకు చెందిన సురేశ్ కుటుంబసభ్యులు, మరో 5 మంది కళాకారులు ఉపాధి పొందుతున్నారు.

పేద రైతుల భూములు లాక్కుంటే సహించం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు



అంకాళపరమేశ్వరి గుడి సిబ్బంది రైతుల భూమిలో కొబ్బరి మొక్కలను తొలగించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పేద రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కుంటే ఎట్టి పరిస్థితుల్లో సహించమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు స్పష్టం చేశారు. గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం గ్రామ సమీపంలో అంకాళపరమేశ్వరి గుడి నిర్వాహకులకు, గుడికి సమీపంలో భూములు కల్గిన రైతులకు గత కొంత కాలంగా తగాదాలు జరుగుతున్నాయి. రైతుల భూమిలో నాటిన కొబ్బరి మొక్కలను ఇటీవల గుడి సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో తొలగించిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలుసుకుని పలువురు బీజేపీ నేతలతో కలిసి జగదీశ్వర నాయుడు అగరమంగళం వద్ద రైతుల భూముల్లో కొబ్బరి మొక్కలు తొలగించిన ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలకు బీజేపీ వ్యతిరేకం కాదని, ఆలయాల పురోభివృద్ధికి ఎప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు. గుడిపేరుతో పేద రైతులకు చెందిన భూములను దౌర్జన్యంగా లాక్కుంటే మాత్రం బీజేపీ అడ్డుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మణివర్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేంద్రన్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందబాబు, నేతలు మురళీ, వెంకటేష్, బాల పాల్గొన్నారు.

అవి తప్పుడు కేసులా?

● కళ్లెదుట జరిగిన ఘటనలు కనిపించలేదా?

● వైసీపీకి టీడీపీ సూటి ప్రశ్న



మాట్లాడుతున్న షణ్ముగం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ సీనియర్ నేత షణ్ముగం ఎద్దేవా చేశారు. చిత్తూరులో ఆదవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై మీ నాయకులు దాడి చేసిన విషయం వాస్తవమా? కాదా? దీనిపై పోలీసులు కేసులు నమోదు చేస్తే, తప్పుడు కేసులు పెట్టారని చెప్పడం ఎంత వరకు సమంజసం. విజయానందరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఓ ప్రాంత ప్రజల పట్ల ఆయన అనుచరులు దురుసుగా ప్రవర్తిస్తేనే పోలీసులు కేసు పెట్టారు. ఈ ఘటనలు అందరి ఎదుట జరిగినవే. అయినా, తప్పుడు కేసులంటూ ప్రకటనలు ఇవ్వడం మీకే చెల్లింది' అంటూ విమర్శించారు. తాము ప్రజాస్వామ్య పద్ధతిలోనే రాజకీయాలను ఎదుర్కొంటామే తప్ప, మీలా ప్రవర్తించడం నేర్చుకోలేదన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ విక్రమ్, కమిషనర్ కృష్ణారెడ్డి, చెస్ ఆడుతున్న బాల బాలికలు

నగరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని నగరి సీఐ విక్రమ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిలు అన్నారు. నగరి మండల పరిధిలోని వీకేఆర్‌పురం సమీపంలో గల అశ్విని కన్వెన్షన్ హాలులో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్, సీనియర్ విభాగం చెస్ పోటీలను వారు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాల నుంచి జూనియర్ విభాగంలో 180 మంది, సీనియర్ విభాగంలో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. తిరుపతి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ వృద్ధులు చెస్ ఆడితే అల్జీమర్ వ్యాధి రాదన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదిన ఫైనల్స్ జరుగుతాయని, అదే రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి చెస్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ, ప్రతినిధి నవీన్‌కుమార్, నగరి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు గజేంద్ర, కార్యదర్శి మోహన్, కోశాధికారి శక్తివేల్, సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ రవిబాబు, నగరి చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఖలీల్‌బాషా, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● పీఏసీఎస్ చైర్మన్ బాలాజి



ముడిపల్లెలో కరపత్రాలు పంచుతున్న వేణుగిరి నాయుడు, గోవిందస్వామి

నగరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి టీడీపీ తోనే సాధ్యమని నగరి పీఏసీఎస్ చైర్మన్ బాలాజి అన్నారు. నగరి మండల పరిధిలోని బీరకుప్పం, కావేటిపురం, కృష్ణాపురం, కేజీకండ్రిగ గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింట కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు భూపతి రెడ్డి, కుమారస్వామి నాయుడు, మునికృష్ణారెడ్డి, సెల్వమణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరి రూరల్ మండలంలోని ముడిపల్లె పంచాయతీలో టీడీపీ కార్యదర్శి వేణుగిరి నాయుడు, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడి తిరునాళ్ల



పెరియపాలయత్తు అమ్మవారికి అంబలి పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

విజయపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తమిళ ఆడినెలను పురస్కరించుకొని నిర్వహించే ఆడి తిరునాళ్లలో భాగంగా మండలంలోని గొల్లకండ్రిగ తిరుత్తణి - పిచ్చాట్టూరులో పెరియపాలయత్తు అమ్మన్ ఆలయంలో, మంగళంలో పొన్నియమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పొన్నియమ్మను ఉభయదారులు పురుషోత్తంరెడ్డి ప్రత్యేక అలంకరణ చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. కోసలనగరం, మహారాజపురంలో గ్రామదేవతకు పొంగళ్లుపెట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి సేవల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, రమణారెడ్డి, కైలాసం యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం వాయిదా

గుడిపాల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిపాల సింగిల్ విండో చైర్మన్‌గా దేవపత్ని ప్రతాప్ నాయుడు, డైరెక్టర్లు ఈ నెల 4వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణల వలన వాయిదా పడిందని ప్రతాప్ నాయుడు తెలిపారు. మరో తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన ఐరాల హైస్కూల్ వజ్రోత్సవాలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఐరాల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వజ్రోత్సవాల ఆరంభ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా రెండోరోజున పాఠశాల ప్రాంగణంలో ఉచిత ఆరోగ్య శిబిరం, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సీతాపతి నాయుడు మాట్లాడుతూ తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి ద్వారా కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. 246 మందికి పరీక్షలు నిర్వహించగా, 46 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికైనట్లు తెలిపారు. 153 మంది క్యాన్సర్ పరీక్షలు చేయించుకోగా, ఎవరికీ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కాలేదన్నారు. వైద్య శిబిరంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పాఠశాల ఎన్సీసీ విద్యార్థులు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నరిగన్నగారి సుధాకర్, డాక్టర్లు భావన, రవళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. సదకుప్పం గ్రామానికి చెందిన వెంకటేష్ ఆచారి తన ఇంటి వద్ద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అతడిని అదుపులోకి తీసుకుని, ఎనిమిది బీరు బాటిళ్లు, 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర నాయకుడికి సన్మానం



నాగేశ్వరరావు, వేణుగోపాలరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వెదురుకుప్పం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గాజుల నాగేశ్వరరావు తిరుపతి జిల్లా బాలాయపల్లి ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆదివారం కార్వేటినగరంలో సన్మానించారు. అలాగే తిరుపతి జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కె.వేణుగోపాల్‌రెడ్డికి కూడా శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గోపీనాథ్, మురహరి, మణిశేఖర్, మునిరాజ, వెంకటేశయ్య, పయని, హేమాద్రి, చిరంజీవి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సింహాల స్వైర విహారం



పచ్చికాపల్లంలో గ్రామ సింహాల విహారం

వెదురుకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో రోజురోజుకీ గ్రామ సింహాల స్వైర విహారం మితిమీరిపోతోందని స్థానికులు తెలిపారు. తరచుగా ఈ వీటి బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వీటి కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు



గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మగుడి దేవస్థానంలో వెలసిన ఆరిమాని గంగమ్మకు ఆదివారం తమిళనాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తులసిరామ్, శివగామి, శివప్రసాద్, విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

గుడిపాల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం మండలంలోని నరహరిపేటలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహం విలువల గురించి పలువురు నాయకులు తమ అభిప్రాయాలను పంచుకుని, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, నాయకులు బాలసుబ్రమణ్యం యాదవ్, శరత్, ప్రదీప్, దొరబాబు, నాగరాజ యాదవ్, హరిప్రసాద్, చందు, పృథ్వీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు చేరువలో టీడీపీ ప్రభుత్వం



కోసలనగరంలో కరపత్రాలు పంచుతున్న బాబుయాదవ్

విజయపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సామాన్యులకు చేరువలో టీడీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉన్నాయని కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కోసలనగరంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.





శిథిల భవనంలో నడుస్తున్న కార్వేటినగరం సీహెచ్‌సీ - నిర్మాణం పూర్తికాని సీహెచ్‌సీ భవనం - ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీ ముందు 108 అంబులెన్స్ దుస్థితి

కరుణించరూ..!

● జీడీనెల్లూరు నియోజకవర్గంలో 'ఆరోగ్యం' అందని ద్రాక్ష?

● వసతుల్లేని సీహెచ్‌సీలు ● పీహెచ్‌సీలు నామమాత్రమే

వెదురుకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు నియోజకవర్గంలోని మండలాల్లో 'ఆరోగ్యం' అందని ద్రాక్షగా మారింది. ● వైసీపీ పాలనలో కార్వేటినగరం, పెనుమూరులో 50 పడకలతో సామాజిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.1305 లక్షలను మంజూరు చేస్తూ 2022 జనవరి 8వ తేదీన భూమి పూజచేశారు. ఇప్పటికీ ఆ భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. కార్వేటినగరంలో శిథిల భవనాల్లో సీహెచ్‌సీ నడుస్తోంది. పెనుమూరులో 50 పడకల ఆస్పత్రి అయినా వసతులు లేకుండా వరండాలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడా భవన నిర్మాణం పునాదుల స్థాయి దాటలేదు. ● జీడీనెల్లూరులో ఉన్న పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచి వైద్య సేవలు అందిస్తామని వైసీపీ ప్రభుత్వంలో హామీలు గుప్పించారు. కానీ, ఆ దిశగా చర్యలు చేపట్టకుండా కాలం గడిపేశారు. ఇప్పటికీ ఆ పీహెచ్‌సీ స్థాయి మారలేదు. తూగుండ్రంలో ఉన్న పీహెచ్‌సీలో కూడా కూడా వసతుల కొరత వెంటాడుతోంది. ● పచ్చికాపల్లంలో ఉన్న పీహెచ్‌సీలో కనీస వసతులు కరువే. ఇక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండటం లేదని స్థానికులు తెలిపారు. ● కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలో పీహెచ్‌సీని మంజూరు చేశారు. తాత్కాలికంగా కత్తెరపల్లెలో ఉరుస్తున్న భవనంలో ఏర్పాటు చేశారు. రెండేళ్ల గడిచిపోయినా ఇప్పటికీ సొంత భవన వసతికి స్థలం కేటాయించలేదు. నిధులూ మంజూరు కాలేదు.

నేడు మంత్రి, ప్రభుత్వ విప్ పర్యటన ఇలా

కార్వేటినగరం మండలం పసలవానిమిట్ట గ్రామంలో ఆరిమాని గంగమ్మ మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో సోమవారం ఉదయం 9 గంటలకు మంత్రి, ప్రభుత్వ విప్ పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు ఇదే మండలంలో ఈడిగపల్లెలో ఆరోగ్య క్లినిక్‌ను ప్రారంభిస్తారు. ● పాలసముద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమం ద్వారా కోకాకోలా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తారు.

108 అంబులెన్స్‌లు డొక్కులైపోయాయి

ఈ నియోజకవర్గంలో 108 అంబులెన్స్‌లు కండీషన్ లేకుండా పోయాయి. మూడేళ్ల క్రితమే ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీ వద్ద ఓ 108 అంబులెన్స్‌ను మరమ్మతులు చేయకుండా దిష్టిబొమ్మగా వదిలేశారు. ఎస్ఆర్ పురం, ఆరిమాకుల పల్లె పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత ఉంది.

గుంతను తవ్వారు.. వదిలేశారు



ప్రమాదకరంగా ఉన్న గుంత

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3(ఆంధ్రజోతి): నగరంలోని బ్రాహ్మణవీధి, దమయంతి వీధులకు వెళ్లే నాలుగు రోడ్ల కూడలిలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది మురుగుకాల్వ మరమ్మతుల కోసం పెద్ద గుంతను తవ్వారు. గుంతను తవ్వి 15 రోజులు గడుస్తున్నా మరమ్మతు పనులు చేయలేదు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో ఇటువైపు వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. సమీపంలో పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. నడిచివెళ్లేవారితో పాటు ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన నగరపాలక అధికారులు వదిలేయడంతో చిన్న పిల్లలు పడిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేసి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో దాడి చేసిన వ్యక్తిపై బాధితుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సంతపేట ఇందిరానగర్‌కు చెందిన గణేష్ తన తమ్ముడు దండపాణితో కలిసి సైకిల్‌షాపును నడుపుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు గణేష్ భోజనానికి ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో తంగవేలుకాలనీకి చెందిన ఈశ్వర్ మద్యం మత్తులో దండపాణిని దుర్భాషలాడగా స్థానికులు సర్దిచెప్పి పంపించారు. అనంతరం ఈశ్వర్ కట్టెతో సైకిల్‌షాపు వద్దకు వచ్చి దండపాణిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి అన్న గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రోతల హృదయాల్లో 'సిరివెన్నెల' చిరస్మరణీయుడు



సిరివెన్నెల పురస్కార గ్రహీతలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చలన చిత్ర సీమ ద్వారా పాటల రచయితగా సిరివెన్నెల సీతారామ శాస్త్రి శ్రోతల హృదయాల్లో చిరస్మరణీయుడు అయ్యాడని, ఆయన స్థానం మరొకరు పూరించలేరని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య వ్యవస్థాపకులు మణ్రిపూడి దేవేంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక రెడ్డి భవన్‌లో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో మణ్రిపూడి దేవేంద్రరావు అధ్యక్షతన సిరివెన్నెల సాహితీ వైభవం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది సాహితీ వేత్తలకు సిరివెన్నెల సాహితీ పురస్కారాలతో కూడిన ఘన సత్కారాలను మణ్రిపూడి దేవేంద్రరావు చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రపల్లె మాధుర్య, శ్రీరాజు, సోము ఉమాపతి, వి.రఘుపతి, హరిప్రసాద్‌రెడ్డి, రోహిత్‌కుమార్, గొడుగుచింత గోవిందయ్య, పురుషోత్తం ఆచారి, శ్రీనివాసమూర్తి, టి.గోవిందన్, మునీంద్ర, చక్రపాణి, లావణ్య, ఓం శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు, కూటమి నాయకులు

తవణంపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా తొలి విడత నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడంతో ఆదివారం మండలంలోని జొన్నగురకల సచివాలయం వద్ద సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు రైతులు, కూటమి నాయకులు పాలాభిషేకం చేశారు. టీడీపీ, జనసేన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వేపంజేరి ఆలయం చుట్టూ ఐరన్‌షీట్ల ఏర్పాటు



వేపంజేరి ప్రధాన ఆలయం చుట్టూ వేసిన ఐరన్‌షీట్లు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరి లక్ష్మీనారాయణస్వామి ఆలయం చుట్టూ భక్తుల నీడ సౌకర్యార్థం ఐరన్‌షీట్లు ఏర్పాటు చేశారు. ఇందుకు గాను హైదరాబాద్‌కు చెందిన దాతలు ముగ్గురు తోడ్పాటు అందించారు. గతంలో ఆలయం చుట్టూ టెంకాయ కీతులతో చలువ పందిళ్ల వేసినప్పటికీ ఆరునెలలకే అవి ఎండకు ఎండి, వానకు తడిసి పనికిరాకుండా పోతుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతుండేవారు. గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి గ్రామానికి చెందిన జగన్నాథం స్వామి కుమారుడు వి.జె.శ్రీనాథ్ అలియాస్ వెంకటేష్ స్వామి హైదరాబాద్‌లో నివాసం ఉంటారు. గ్రామానికి వచ్చినప్పుడు ఆలయంలో భక్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఐరన్‌షీట్లు వేసేందుకు ఆయన పనులు ప్రారంభించారు. ఆయన స్నేహితులైన ముకుందన్, కన్నన్‌లు కూడా ఇందుకు సహకారం అందించారు. ఎట్టకేలకు ఆలయం చుట్టూ ఐరన్‌షీట్లు ఏర్పాటు చేసి నీడ కల్పించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూతగాదాలో ఇరువర్గాల ఘర్షణ

పుంగనూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడి ఆదివారం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. బాధితుల కథనం మేరకు... మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్ట గ్రామానికి చెందిన వీరప్ప కుమారుడు వెంకటరమణ, అదే గ్రామానికి చెందిన సుబ్బన్న కుమారుడు మోహన్, అతని భార్య గౌతమి పొలం వద్ద ఘర్షణ పడి కట్టెలతో కొట్టుకోవడంతో ముగ్గురు గాయపడ్డారు. ఇరువర్గాలకు చెందిన ముగ్గురూ చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్సలు పొందుతున్నారు.

ఇలాగైతే రోగాలు రావా?



పశువుల నీటి తొట్టెలో పురుగులు, పాచిపట్టిన నీరు

వెదురుకుప్పం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కేఎం పురం గ్రామ పంచాయతీ గొల్లకండ్రిగ సమీపంలో పశువుల దాహార్తి తీర్చడానికి నిర్మించిన నీటి తొట్టె దాహార్తిని తీర్చకుండా రోగాలను తెచ్చిపెట్టేలా ఉంది. ఎందుకంటే ఆ తొట్టెలో నీరంతా పాచిపట్టిపోయి, పురుగులు పడి ఉందని స్థానికులు తెలిపారు. దాన్ని పరిశుభ్రంగా ఉంచకపోవడం వల్ల పశువులతో పాటు మనుషులకు అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యంకు అనుగుణంగా నీటి తొట్టెలను పరిశుభ్రపరచాల్సి ఉందని చెప్పారు.

కూలడానికి సిద్ధంగా పాఠశాల భవనం

● విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం



బావిలోకి కూలిపోయిన పాఠశాల ప్రహరీ

పాలసముద్రం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళ్రాజుకుప్పం ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూలి తొమ్మిది నెలలు గడుస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత నవంబరు నెలలో కురిసిన భారీ వర్షాలకు పాఠశాల భవనానికి అనుకొని ఉన్న వ్యవసాయ బావి రాతి కట్టడం కూలిపోయింది. రానురాను పాఠశాల ప్రహరీ గోడ సమీపానికి గొయ్యి పెద్దదై ప్రహరీ గోడ పాక్షికంగా కూలిపోయింది. దీంతో పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఎస్ఏ అధికారులు పాఠశాల భవనాన్ని, దెబ్బతిన్న ప్రహరీగోడను పరిశీలించి వ్యవసాయ బావి సొంతదారులైన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ ఖర్చుతో బావిని పూడ్చి వేస్తే తమకు అభ్యంతరం లేదని రైతులు రాత పూర్వకంగా తెలిపారు. ఈ వ్యవసాయ బావిని పూడ్చడానికి సుమారు రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వం నేటికీ నిధులు విడుదల చేయకపోవడంతో బావిని పూడ్చలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం వలన ఎప్పుడు పాఠశాల భవనం కూలిపోతుందోనని ఉపాధ్యాయులు, విదార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి బావిని పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.